క్లుప్తంగా

రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణల తొలగింపు



పెడన: పట్టణంలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుండటంతో శనివారం పెడన ఎస్‌ఐ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు తమ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధాన రహదారిలో మార్జిన్ వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించారు. వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సమీపంలో పార్కింగ్ చేసుకుని వచ్చేలా చూడాలని దుకాణాదారులకు సూచించారు. రోడ్డుపై దుకాణాలకు సంబంధించిన నేమ్ బోర్డులు కూడా తీసేయాలని సూచించారు.

వరద ప్రభావిత కుటుంబాలకు నెస్లే ఇండియా సాయం



ఎదురుమొండి(నాగాయలంక): మండలంలోని ఎదురుమొండి దీవిలో ఇటీవల వరద ప్రభావిత ప్రాంతమైన నాచుగుంట గ్రామంలో 525 మత్స్యకార కుటుంబాలకు నెస్లే ఇండియా, జేసీఐ ద్వారా శనివారం నిత్యావసర సరుకులు, నెస్లే ఉత్పత్తుల కిట్స్ పంపిణీ చేశారు. సంస్థల సీఎస్ఆర్(కార్పొరేట్ సామాజిక బాధ్యత) కనెక్ట్ ప్రాజెక్టు కింద కిట్స్‌ను తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్ చేతులమీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. నెస్లే కార్పొరేట్ అఫైర్స్ మేనేజర్ వసీం అహ్మద్, జేసీఐ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.విశ్వేశ్వరరావు, కామిశెట్టి ప్రమోద్ కుమార్, డీటీ అబ్దుల్ రఫీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లికి విరాళాల వెల్లువ



చల్లపల్లి(అవనిగడ్డ): స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమానికి పెద్ద ఎత్తున దాతలు విరాళాలు అందించారు. ఈ కార్యక్రమం పదేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు దుగ్గిరాల శివప్రసాద్ రూ.2 లక్షల విరాళాన్ని స్వచ్ఛ సుందర చల్లపల్లి నిర్వాహకులు డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్–డాక్టర్ పద్మావతి దంపతులకు అందించారు. డాక్టర్ మాలెంపాటి గోపాలకృష్ణయ్య రూ.25 వేలు, ఘంటా హేమలత రూ.25వేలు, తుళ్లూరి లక్ష్మీనరసింహారావు రూ.10 వేలు, ప్రాతూరి శాస్త్రి రూ.10 వేలు, ఉడత్తు వెంకటేశ్వరరావు రూ.10వేలు, వడ్డి బ్రహ్మేశ్వరరావు రూ.5వేలు విరాళాన్ని అందించారు.

ఉచిత వైద్య శిబిరం



ఘంటసాల: మచిలీపట్నం ఆంధ్ర హాస్పిటల్ వారిచే ఘంటసాలలోని యూవీఆర్ గొర్రెపాటి స్కూల్ ప్రాంగణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ బి.తేజనవీన్, దంత వైద్యురాలు డాక్టర్ బి.పద్మ, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ వి.వరద రాజ్ సుమారు 250 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యులు తేజా నవీన్, పద్మ, బి.భానుప్రకాష్, మచిలీపట్నం ఆంధ్రా హాస్పిటల్ డైరెక్టర్ మాటూరి శివరామకృష్ణ ప్రసాద్‌లను యూవీఆర్ గొర్రెపాటి స్కూల్ ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావు, గొర్రెపాటి ట్రస్టు ప్రతినిధులు గొర్రెపాటి రామకృష్ణ, కొండపల్లి రామకృష్ణ సన్మానించారు.

13న కోటి దీపోత్సవం

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయం (గాలిగోపురం) వద్ద ఈనెల 13న కోటి దీపోత్సవ కార్యక్రమం జరుగుతుందని ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కమలానంద భారతి స్వామి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు.

నీటి సంఘాల ఎన్నికలు...

నేడు ముసాయిదా ఓటర్ల జాబితా

- పెడన మండలంలో 130 ప్రాదేశిక నీటి సంఘాలు
- 18 నీటి సంక్షేమ సంఘాలు
- ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలలో భాగస్వామ్యం
- 20న తుది జాబితా... 21న ఎన్నికలు



నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల జాబితాలో తలమునకలైన వీఆర్వోలు

పెడన: సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియను సంబంధిత శాఖాధికారులు ప్రారంభించారు. ఇరిగేషన్ అధికారులు పెడన మండలంలోని సాగునీటి కాలువల కింద ఏయే సర్వే నంబర్లు ఉన్నాయనే విషయాలను తెలియజేస్తూ పంచాయతీ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో పెట్టారు. నీటి పారుదల శాఖ ఆ దిశగా చర్యలు చేపట్టి ఓటరు జాబితాలను తయారు చేసేందుకు రెవెన్యూ శాఖకు అప్పగించడంతో ఆయా సర్వే నంబర్ల ఆధారంగా ఏయే రైతులున్నారనే దానిపై మండల రెవెన్యూ శాఖలోని వీఆర్వోలు తలమునకలయ్యారు. ఈ నెల 10న ముసాయిదా జాబితాను వెల్లడించనున్నారు. 11, 12 తేదీలలో అభ్యంతరాలను స్వీకరిస్తారు. 13న పరిష్కరించి ఆ రోజు సాయంత్రం జాబితా ప్రకటిస్తారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే ఆయా అభ్యంతరాలపై 14, 15 తేదీలలో మచిలీపట్నం ఆర్డీవోకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆర్డీవో స్థాయిలో కూడా పరిష్కారం కాకపోతే కాడా (సీఏడీఏ) వాటర్ కమిషనర్ కార్యాలయంలో అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. అనంతరం 20న తుది ఓటరు జాబితా వెల్లడించి 21న ఎన్నికలు నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ఓటరుగా ఎవరిని నమోదు చేయనున్నారంటే...

సాగునీటి సంఘాల ఎన్నికలలో మండలంలో ప్రవహించే సాగునీటి కాలువలు, పంట కాలువల ఆయకట్టు కింద ఉన్న రైతులను ఓటర్లుగా చేర్చనున్నారు. 18 సంవత్సరాలు నిండి, ఆ పంట పొలంకు సంబంధించి పట్టాదారు పాస్‌పుస్తకం లేదా రిజిస్టర్డ్ డాక్యుమెంటు ఉన్న రైతులను, అగ్రిమెంటు లీజు డాక్యుమెంట్లున్న కౌలు రైతులను, ఆయా ఆయకట్టుల కింద చెరువులు కలిగి డాక్యుమెంట్లు ఉన్న రైతులను కూడా ఓటరుగా నమోదు చేయనున్నారు.

మండలంలో 130 ప్రాదేశిక సాగునీటి సంఘాలు

పెడన మండల వ్యాప్తంగా 130 ప్రాదేశిక సాగునీటి సంఘాలున్నాయి. అలాగే 18 వాటర్ అసోసియేషన్లు, ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీలలో పెడన ఓటర్లు భాగస్వాములు కానున్నారు. 130 ప్రాదేశిక సాగునీటి సంఘాల ఎన్నికలను ఈ నెల 21న నిర్వహించనున్నారు. అనంతరం వీటి పైన 18 సాగునీటి సంక్షేమ సంఘాల ఎన్నికలుంటాయి. ప్రాదేశిక సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన వారు వాటర్ అసోసియేషన్ నాయకులను ఎన్నుకుంటారు. వాటర్ అసోసియేషన్ సంఘాల్లో గెలుపొందిన వారు ఐదు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లను ఎన్నుకోనున్నారు.

ఓటర్ల జాబితా వరకే మా పని



సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి రెవెన్యూ శాఖా పరంగా ఓటర్ల జాబితా తయారు చేసి ఇవ్వడం వరకే మా పని. ఆ తర్వాత అంతా నీటి పారుదల శాఖాధికారులదే. ఆయా ఆయకట్టుల కింద ఏయే సర్వే నంబర్లు ఉన్నాయనే వివరాలను అందజేశారు. వాటి ఆధారంగా ఆయా సర్వే నంబర్లలో రైతులు ఎవరున్నారో పరిశీలించి ఓటరు జాబితాను తయారు చేసి ఇవ్వడం వరకు మాత్రమే మా బాధ్యత. జాబితా రూపొందించి అభ్యంతరాలను స్వీకరించి తుది జాబితా ప్రకటించిన పిమ్మట ఆ జాబితాను ఇరిగేషన్ వారికి అప్పగిస్తాం.

– కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు, పెడన

ఎండురొయ్యలు అమ్ముతూ వృద్ధురాలి మృతి

కోడూరు: ఎండు చేపలు, ఎండు రొయ్యలు ఇంటింటా తిరుగుతూ అమ్మే వృద్ధురాలు ఆకస్మికంగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతిచెందిన ఘటన అవనిగడ్డలో చోటు చేసుకుంది. కోడూరు మండలం పాలకాయతిప్ప గ్రామానికి చెందిన చిలకపూడి కృష్ణమ్మ (65) గత 45 ఏళ్ల నుంచి ఎండు చేపలు, ఎండు రొయ్యలు వ్యాపారం చేసుకుంటూ కుటుంబపోషణ కొనసాగిస్తోంది. నాగాయలంక మార్కెట్ నుంచి ఎండు చేపలు, రొయ్యలను తీసుకువచ్చి ప్రతి రోజూ గ్రామాల్లోకి వెళ్లి వీటిని విక్రయిస్తుంది. రోజు మాదిరిగానే కృష్ణమ్మ ఉదయం 5.30 గంటలకు పాలకాయతిప్ప బస్సు ఎక్కి అవనిగడ్డ మండలం రామచంద్రపురం వద్ద ఎండు రొయ్యలు అమ్మేందుకు దిగింది. ఇంటింటికీ తిరుగుతూ రొయ్యలు అమ్ముతూ ఉండగా, కృష్ణమ్మకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో రహదారిపైనే కుప్పకూలిపోయింది. ఘటనాస్థలంలోనే కృష్ణమ్మ ప్రాణాలు విడిచింది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.



ఘటనాస్థలంలో మృతి చెందిన కృష్ణమ్మ

బోళ్లపాడులో అగ్ని ప్రమాదం

మల్లంపల్లి(ఘంటసాల): ఘంటసాల మండలం మల్లంపల్లి పంచాయతీ శివారు బోళ్లపాడు గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు నిట్టాళ్ల ఇల్లు పాక్షికంగా కాలిపోయింది. మొవ్వ ఫైర్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు అందించిన వివరాల మేరకు బోళ్లపాడు గ్రామానికి చెందిన ఎ.నాగరాజుకు చెందిన రెండు నిట్టాళ్ల ఇంటికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.1.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

పన్నులు చెల్లించకుంటే పవర్ కట్

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి, తాగునీటి పన్నులు చెల్లించాల్సిన వారు వెంటనే చెల్లించాలని కమిషనర్ బాపిరాజు శనివారం ఒక ప్రకటనలో కోరారు. పన్నులు చెల్లించని వారి ఇంటి విద్యుత్ కనెక్షన్లను తొలగించే చర్యలు చేపట్టనున్నామని వెల్లడించారు. పన్నులు కట్టించుకునే కౌంటర్లు ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్విరామంగా పనిచేస్తాయని ఆయన తెలిపారు.

చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా కొమ్మారెడ్డి హైస్కూల్ విద్యార్థులు

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం హైస్కూలు విద్యార్థులు శనివారం మచిలీపట్నంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచినట్లు పాఠశాల డైరెక్టర్ కె.కిషోర్ తెలిపారు. మచిలీపట్నం సన్‌స్టార్ స్కూలులో మచిలీపట్నం ఆర్ట్స్ అకాడమీ, స్టార్ హెల్పింగ్ హబ్ ఆధ్వర్యంలో మచిలీపట్నం డివిజన్ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో కొమ్మారెడ్డి పాఠశాలకు చెందిన పులి హేమ ప్రథమ స్థానం, ఎ.రఘురామ మహర్షి ద్వితీయ స్థానం సాధించారన్నారు. విజేతలకు అకాడమీ కార్యదర్శి రమేష్, హెల్పింగ్ హబ్ అధ్యక్షుడు అయ్యప్పస్వామి, స్టార్ విద్యాసంస్థల నిర్వాహకుడు శ్రీరామ్, డీవైఈవో శేఖర్‌సింగ్ ధ్రువీకరణ పత్రాలు, మెడల్స్ అందజేసి అభినందించారు. విజేతలను పాఠశాల డైరెక్టర్ కిషోర్, హెచ్ఎం శ్రీనివాసరావు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ అందరూ చేయాల్సిందే

పెడన: గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది అంతా హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చేయాల్సిందేనని, ఇందులో ఎవరికీ మినహాయింపు లేదని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరామ్ స్పష్టం చేశారు. హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌కు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇచ్చారని, వారు చేయడం లేదని ఫిర్యాదులు వస్తుండటంపై ఎంపీడీవో స్పందించి శనివారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పంచాయతీ కార్యదర్శులు కూడా తప్పనిసరిగా హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ చేయాల్సిందేనన్నారు. ఏమైనా పొరపాట్లు జరిగితే పూర్తిగా వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఆయన సూచించారు.

శ్మశానవాటికలో ముళ్లచెట్ల తొలగింపు

కోడూరు: కోడూరు పంచాయతీ పరిధిలోని నరసింహపురం శ్మశానవాటికలో ఇబ్బందికరంగా మారిన ముళ్లచెట్లు, చెత్తాచెదారాన్ని పంచాయతీ అధికారులు శనివారం తెలిపారు. శ్మశానవాటిక ప్రాంగణమంతా దట్టమైన చెట్లు అల్లుకుని ముళ్లకంప పేరుకుపోయింది. దీంతో మృతుల దహన సంస్కారాలు చేసేందుకు గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సర్పంచి వెన్నా షైనీ, కార్యదర్శి బొలిశెట్టి శేషగిరిరావు స్పందించి శ్మశానవాటిక ప్రాంతంలో పూర్తిస్థాయిలో జంగిల్ క్లియరెన్స్ నిర్వహించారు.

ఉప ఆలయ నిర్మాణానికి భూమి పూజ

బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు గ్రామంలో ఉన్న శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణాన్ని పురస్కరించుకుని ఉప ఆలయానికి శనివారం భూమి పూజ చేశారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన శివాలయం ప్రధాన రహదారి కన్నా పల్లంగా ఉండి ఆలయ గోపుర శిఖరాలు శిథిలావస్థకు చేరడంతో పునః నిర్మించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రధాన మూర్తులను భద్రపరిచి, ధూపదీప నైవేద్యాలు నిర్వహించేందుకు ఉప ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ సరోజ, శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ట్రస్టీ వూట్ల సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంయూడీఏ చైర్మన్‌గా మట్టా ప్రసాద్

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా మట్టా ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. గుడివాడ సత్యనారాయణపురానికి చెందిన ఈయన 2016లో బీజేపీలో సభ్యత్వం తీసుకున్నారు. 2019–22 సంవత్సరాల మధ్య బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఎంయూడీఏ చైర్మన్‌గా తనను నియమించటం పట్ల ఆయన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

పాపారావుకు పలువురి అభినందనలు

అవనిగడ్డ: అగ్నికుల క్షత్రియ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావుని శనివారం పలువురు అభినందించారు. జనసేన పార్టీ నాయకులు గాజుల శంకరరావు, కొండవీటి సునీత, పూషడపు రతన్‌గోపాల్, నెరసు కృష్ణాంజనేయులు, బీజేపీ నాయకులు కొండవీటి రామకృష్ణ, మత్తి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు బీసీ సంఘం నాయకులు ఆయన్ను అభినందించిన వారిలో ఉన్నారు.

అభ్యంతరాలుంటే తెలపాలి

ఘంటసాల: సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే రెండు రోజుల్లోగా సంబంధిత అధికారులకు తెలపాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. ఘంటసాల తహసీల్దార్ కార్యాలయం వద్ద సాగునీటి ఓటర్ల ప్రదర్శన జాబితాపై శనివారం రెవెన్యూ అధికారులు, సిబ్బంది కసరత్తు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ మండలానికి సంబంధించిన సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాను ఆదివారం నుంచి మంగళవారం వరకు తహసీల్దార్, మండల పరిషత్, పంచాయతీ, సచివాలయాలతో పాటు పీఏసీఎస్‌ల వద్ద ప్రదర్శిస్తామన్నారు. ఆ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 13వ తేదీ లోపు సంబంధిత పత్రాలతో వీఆర్వో లేదా తహసీల్దార్ కార్యాలయంలో తెలిపాలని కోరారు. మండలంలో ఎమ్మెల్సీ ఓటుకు 900 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. సమావేశంలో డీటీ బి.కనకదుర్గ, రీ సర్వే డీటీ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ కె.శ్రీనివాస్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

బంటుమిల్లి: మండల పరిధిలోని అర్తమూరు గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు బాలుడు(14) ద్విచక్ర వాహనంపై సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించకపోవడంతో ఢీకొట్టి తీవ్రంగా గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జవగా గాయపడ్డ బాలుడిని కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మచిలీపట్నం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతో పోలీస్ కేసు నమోదు కాలేదని ఎస్ఐ గణేష్‌కుమార్ తెలిపారు. బాలుడు బంటుమిల్లిలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నట్లు సమాచారం.

స్వచ్ఛమైన ఓటర్ల జాబితాకు సహకరించండి

ఓటర్ల జాబితా పరిశీలకుడు నాయక్

చిలకలపూడి(మచిలీపట్నం): పటిష్టమైన ఓటర్ల జాబితా తయారీకి అందరూ సహకరించాలని జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు ముధావత్ ఎం.నాయక్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్ల జాబితా కీలకమని, అది పటిష్టంగా ఉన్నప్పుడే ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించగలుగుతామన్నారు. మృతి చెందిన వారు, శాశ్వతంగా వలస పోయిన ఓటర్లను తొలగించి సరైన జాబితాను తయారు చేయాలన్నారు. ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి వారికి ఈ మార్గదర్శకాలను స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియగా నడుస్తుందన్నారు.



మాట్లాడుతున్న పరిశీలకుడు నాయక్, వేదికపై కలెక్టర్, జేసీ

జిల్లాలో 15,38,937 మంది ఓటర్లు

కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 20,97,208 మంది జనాభా ఉన్నారని వీరిలో 15,38,937 మంది ఓటర్లు ఉన్నారన్నారు. మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. మొత్తం 1016 ప్రదేశాల్లో 1769 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. క్షేత్రస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ అభ్యంతరాలు, సలహాలు, సూచనలను తెలియజేశారు. అనంతరం నగరంలోని పాండురంగ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని నాయక్ పరిశీలించారు. ఇన్‌చార్జ్ డీఆర్వో బి.శ్రీదేవి, ఈఆర్వోలు స్వాతి, బాలసుబ్రహ్మణ్యం, షారోన్, రమేష్‌బాబు, షాహిద్‌బాబు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాలను సందర్శించిన డాక్టర్ సింహాద్రి



సంగమేశ్వరుడికి పూజలు చేసిన డాక్టర్ సింహాద్రి, కుటుంబ సభ్యులు

మోపిదేవి/నాగాయలంక/ఘంటసాల: ప్రఖ్యాత ఆంకాలజీ నిపుణుడు, వైఎస్సార్ సీపీ బందరు పార్లమెంటు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు శనివారం కుటుంబంతో కలసి అవనిగడ్డ నియోజకవర్గంలో ప్రముఖ ఆలయాలైన మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, సంగమేశ్వరంలోని చారిత్రక ప్రసిద్ధి కలిగిన శ్రీగంగాపార్వతీ సమేత శ్రీసంగమేశ్వరస్వామి ఆలయం, శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వర స్వామి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో విశేష పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. ప్రజలందరికీ మేలు జరగాలని స్వామిని వేడుకున్నట్లు డాక్టర్ చంద్రశేఖరరావు తెలిపారు. మోపిదేవి ఆలయానికి వచ్చిన ఆయనకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరావు(బుల్లి), జిల్లా కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు స్వాగతం పలికారు. సంగమేశ్వరంలో అవనిగడ్డ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, లంకేశ్వరరావు, కొండవీటి కిశోర్‌బాబు పాల్గొన్నారు. శ్రీకాకుళంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఓటరు మార్పులు.. చేర్పులకు ప్రత్యేక శిబిరం



శింగరాయపాలెంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్ తదితరులు

పెడన: పెడన అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఓటరుగా నమోదు చేసుకోవడానికి, చిరునామాలు మార్చుకోవడానికి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ అన్నారు. పెడన మండలంలోని శింగరాయపాలెం, బల్లిపర్రు తదితర గ్రామాల్లోని పోలింగ్‌బూత్‌లలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆయన పరిశీలించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఓటరుగా 18 సంవత్సరాలు నిండిన వారు నమోదు చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం కల్పించిందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 9, 10 తేదీలతో పాటు 17న కూడా ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేశామని చెప్పారు. చనిపోయిన వారి పేర్లు తొలగింపు, చిరునామాల మార్పు, కొత్తగా ఓటర్ల చేర్పులు, మార్పులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరిస్తామన్నారు. ఆయా బూత్‌లలో వాటికి సంబంధించి దరఖాస్తులను బీఎల్‌వోలు ఇస్తారని, వాటిని పూర్తి చేసి అక్కడే ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.జయరాం, ఆర్ఐ విజయలక్ష్మి తదితరులున్నారు.

కనులపండువగా వెంకటేశ్వరుడి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు, ఉభయదాతలు

కోడూరు: వేదపండితుల మంత్రోచ్చరణలు.. బాజాబజంత్రీల మేళతాళాలు.. పూల పరిమళాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామివారి జన్మతిథి, శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఉత్సవ మూర్తులకు తిరుమంజన సేవను భక్తిప్రపత్తులతో జరిపారు. అనంతరం ప్రత్యేక వేదికపై స్వామివార్ల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల గుణగణాలను వేదపండితులు వివరించిన తీరు ఆకట్టుకుంది. మహిళలు ఆలయంలో కార్తిక దీపాలు వెలిగించి భక్తిభావం చాటుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ పర్యవేక్షించారు.

కార్తిక దీప ప్రమిదలతో సామూహిక హారతి



కృష్ణాతీరంలో పోటెత్తిన భక్తజనంతో కార్తీక దీప ప్రమిదలతో సామూహిక హారతి ప్రదర్శన



కోటివత్తులు ప్రజ్వలన గావించిన ఉభయదాత నాగేశ్వరరావు దంపతులు

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీరామలింగేశ్వరస్వామి మండపంలో శనివారం రాత్రి జరిగిన సామూహిక కార్తిక దీప ప్రమిదల ప్రదర్శన, నవహారతుల కార్యక్రమానికి భక్తులు పోటెత్తారు. అర్చకుడు అంబా సాయికిరణ్‌శర్మ 500 కొబ్బరి చిప్పలతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. నవహారతుల సమయంలో వాటికి అభిముఖంగా ఏక కాలంలో మహిళలు దీప ప్రమిదల పళ్లాలను చేతబూని వేద మంత్రోచ్చరణలకు అనుగుణంగా లయబద్ధంగా సామూహికంగా తిప్పడంతో నేత్రపర్వంగా ఆధ్యాత్మిక వెలుగులు విరజిమ్మాయి. తొలుత శివయ్య, నందీశ్వరులకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి అనంతరం మంత్ర పుష్ప నీరాజనాలు సమర్పించారు. తొలుత ఉభయ దాతలైన సబ్బినేని నాగేశ్వరరావు దంపతులు కోటి వత్తుల దీప ప్రజ్వలన గావించారు. శ్రీరామపాద క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, క్షేత్రపాలకుడు తలశిల రఘుశేఖర్, ఉప్పల బుజ్జి, బోయపాటి రాము, కనిగంటి నారాయణ, తలశిల తాతయ్య, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కార్తిక పౌర్ణమి ఏర్పాట్లు పకడ్బందీగా చేయండి

మంత్రి కొల్లు రవీంద్ర

చిలకలపూడి(మచిలీపట్నం): కార్తిక పౌర్ణమి సందర్భంగా సముద్రంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో శనివారం రాత్రి ఆయన అధికారులతో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ శుక్రవారం తెల్లవారుజాము నుంచి సముద్ర స్నానాలకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. బీచ్ వద్ద ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ నెల 11 నుంచి పాండురంగ ఉత్సవాలు, 13న రథోత్సవం సజావుగా నిర్వహించేందుకు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు బస్సులు, ఆటోలకు ప్రత్యేక స్టాండ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ సముద్ర పుణ్యస్నానాలు చేసేందుకు వచ్చే భక్తులకు మైక్‌ల ద్వారా తగిన జాగ్రత్తలు, హెచ్చరికలు ఎప్పటికప్పుడు జారీ చేస్తూ ఉండాలన్నారు. సమావేశంలో ఆర్డీవో కె.స్వాతి, డీపీవో జె.అరుణ, డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాని, జిల్లా ప్రజా రవాణాధికారి వాణిశ్రీ, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పంచదారతో శివుడికి అభిషేకం



పూజలందుకున్న స్వామివారు

మచిలీపట్నంటౌన్: కార్తిక మాసోత్సవాల సందర్భంగా నగరంలోని పలు శివాలయాల్లో శనివారం స్వామివారికి దీపారాధనలు, పూజలు చేశారు. ఆర్.పేటలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి పంచదారతో అభిషేకం చేసి పూలతో అలంకరించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

దీపారాధనలతో నిండిన ఆలయ ప్రాంగణం



మోపిదేవి ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపారాధనలు చేస్తున్న మహిళలు

మోపిదేవి: కార్తికమాసం సందర్భంగా మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం కార్తిక శోభ సంతరించుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం పొంగలి శాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తిక దీపారాధనలు చేసి భక్తిభావాన్ని చాటుకున్నారు. అనంతరం స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా గౌరవాధ్యక్షునిగా భానుమూర్తి



మచిలీపట్నంటౌన్: హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ కృష్ణాజిల్లా గౌరవాధ్యక్షునిగా జీజీహెచ్ నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ జి.భానుమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ఫౌండేషన్ నిర్వాహకులు శనివారం జరిగిన సమావేశంలో ఈ ఆయన్న ఏకగ్రీవంగా ఎన్నుకుని నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భానుమూర్తి మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ కొరకు నిరంతరం పాటుపడతానన్నారు. డాక్టర్ భానుమూర్తికి ఫౌండేషన్ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది అభినందనలు తెలిపారు.